## క్లుప్తంగా

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : మున్సిపల్ వార్డులలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్‌–1, ఎస్‌.వి.ఆర్‌.వీధి–1, దేవళంవీధి–2, గాంధీపురం–1, సొసైటీకాలనీ–2, కృష్ణానగర్‌–2, ప్రశాంత్‌నగర్‌–1, కురవంక–1, నీరుగట్టువారిపల్లె–2, రామిరెడ్డిలేఔట్‌–3 మొత్తం 15వార్డు వలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత కలిగి, స్థానిక నివాసితులై 18–35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. వీరు ఈనెల 21 నుంచి 25లోపు ఆన్‌లైన్‌లో ఏపీ వలంటీర్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టాలి

రామసముద్రం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్‌ మహిళ శిశుసంక్షేమ సహాయకులు మురళి సూచించారు. శుక్రవారం స్థానిక జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాల కార్మికుల గురించి, వాటి చట్టాలు, శిక్షల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ మురళిధర్‌, అధ్యాపకులు నాగరాజు, భవాని, సత్యనారాయణ, రవి, శ్రీలత, లక్ష్మీ, వేదవతి, చిరంజీవి, శివ పాల్గొన్నారు.

### సారా ఊట ధ్వంసం

పీలేరు రూరల్‌: సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో సీఐ వై.గురుప్రసాద్‌ తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు మండలంలోని జాండ్లపంచాయతీ ఆవులయ్యగారిపల్లె అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రాఘవయ్య, యోగానంద్‌, లోకేష్‌, సుధాకర్‌, సురేష్‌, తదితరులు పాల్గొన్నారు.

### చేపల చెరువు వేలంతో పంచాయతీకి ఆదాయం

రామసముద్రం: చేపల చెరువు వేలంతో పంచాయతీకి ఆదాయం చేకూరినట్లు పంచాయతీ కార్యదర్శి షబీనా తెలిపారు. శుక్రవారం కాప్పల్లె సచివాలయంలో పంచాయతీ పరిధిలోని చేపల చెరువులను సర్పంచ్‌ నారాయణమ్మ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహించారు. పాయిచెరువు రూ.96 వేలకు శ్రీకాంత్‌, చల్లాచెరువు రూ.32 వేలకు అక్బర్‌ వేలంలో దక్కించుకున్నారు. పంచాయతీకి రూ.1.28 లక్షలు ఆదాయం చేకూరినట్లు తెలిపారు. ఆరు నెలల పాటు మాత్రమే చేపలు పట్టుకునేందుకు అర్హత ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### సంఘాలుగా ఏర్పడితే రుణ సహాయం

పెద్దమండ్యం: అమూల్‌ డెయిరీకి పాలు పోసే రైతులు సంఘాలుగా ఏర్పడితే రుణ సహాయం అందిస్తారని ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. మండలంలోని వెలిగల్లు, కలిచెర్ల, బండ్రేవు గ్రామాల్లో శుక్రవారం జగనన్న పాలవెల్లువపై గ్రామసభలు నిర్వహించారు. 54 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డెయిరీకి పాలుపోసే పాడి రైతులకు స్త్రీ నిధి రుణాలు అందిస్తారని తెలిపారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జి. రమేష్‌, వెటర్నరీ డాక్టర్‌ విక్రమ్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ జనార్దన్‌, పంచాయతీ కార్యదర్శులు శైలజ, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

### ఘనంగా గంధోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక జామియా మసీదు వద్ద నున్న హజరత్‌ ఖాదర్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక దక్నీపేట ఇలియాస్‌,షేక్‌ జమాల్‌ ఇంటి వద్ద నుంచి గంధం ను ఊరేగింపుగా దర్గాకు చేరుకుంది. ముతవల్లిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉరుసు పురస్కరించుకుని దర్గా, దక్నీపేట, కోటవీధి, బెంగళూరు బస్టాండు ప్రాంతాలను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

### ప్రజా సమస్యలను పరిష్కరించండి

పెద్దతిప్పసముద్రం: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజలతో మమేకమై సమస్యలను పెండింగ్‌లో లేకుండా సత్వర సేవలు అందించాలన్నారు. సచివాలయా ల్లో అందుతున్న సేవలు, ప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్య త వలంటీర్లు, సచివాలయ సిబ్బందిదే అన్నారు.

### 23 నుంచి వన్నూర్‌సాహెబ్‌ ఉరుసు

మదనపల్లె సిటీ: స్థానిక వన్నూర్‌సాహెబ్‌గుట్టలో వెలసిన బాబా ఏసానుల్లా ఖాన్‌వారీ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభంకానున్నట్లు ఖాన్‌వార్సీ ట్రస్టు చైర్మన్‌ బాబా నసీబుల్లాఖావార్సీ తెలిపారు. 23న గంధం, 24న ఉరుసు, 25 ఉచిత మెడికల్‌ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

# టమాట ధరలకు రెక్కలు

- కిలో రూ.40 పలుకుతున్న వైనం
- వారం రోజులుగా ధరల పెరుగుదల

**టమాట మండీలకు వస్తున్న స్టాకు, ధరల వివరాలు**

| తేదీ | స్టాకు వివరాలు (మెట్రిక్‌ టన్నుల్లో) | ధరలు (25 కేజీల క్రేట్‌) |
|---|---|---|
| 13.01.23 | 145 | రూ. 500 |
| 14.01.23 | 167 | రూ.600 |
| 15.01.23 | 158 | రూ. 645 |
| 16.01.23 | 149 | రూ. 670 |
| 17.01.23 | 136 | రూ. 700 |
| 18.01.23 | 149 | రూ.850 |
| 19.01.23 | 174 | రూ.1050 |
| 20.01.23 | 185 | రూ.900 |


ఎగుమతికి సిద్ధంగా ఉన్న టమాటలు

గుర్రంకొండ : నాలుగునెలల తరువాత మార్కెట్లో టమాట ధరలు పుంజుకొన్నాయి. ప్రస్తుతం కిలో టమాటా రూ. 40 వరకు ధర పలుకుతున్నాయి. జిల్లాలో టమాట పంట దిగుబడి తగ్గుతుండడం వల్ల కూడా మార్కెట్‌లో ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్‌ వర్గాలు పేర్కొంటున్నాయి.

**26 వేల ఎకరాల్లో పంట దిగుబడి**

జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో ప్రస్తుతం 26 వేల ఎకరాల్లో టమాట దిగుబడి వస్తోంది. ప్రతి ఏడాది ఈసీజన్‌లో 35వేల నుంచి 44వేల ఎకరాల్లో టమాట పంట దిగుబడి వచ్చేది. ఇటీవల కురిసిన వర్షాలకు తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో పంట దిగుబడి ఈ నెలలో అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 44 వేల ఎకరాల్లో పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఈసీజన్‌లో 35 ఎకరాల్లోనే టమాట దిగుబడి వస్తుండడం గమనార్హం. ఇటీవల కురిసిన వర్షాలతో తోటలు తెగుళ్ల బారిన పడి బాగా దెబ్బతిన్నాయి.

**వారం రోజులుగా పుంజుకొన్న ధరలు**

వారం రోజుల క్రితం ఉన్న టమట ధరలతో పోల్చుకొంటే ప్రస్తుతం 50 శాతానికిపైగా ధరలు పెరిగాయి. వారం నెజుల కిందట 25 కేజీల టమాట క్రేట్‌ ధరలు అత్యధికంగా రూ.250 నుంచి రూ.320 వరకు ధరలు పలికాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్‌ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతున్నాయి. ప్రస్తుతం మొదటిరకం టమాటకిలో రూ.40, రెండోరకం కిలో రూ.34, మూడో రకం రూ.25 వరకు ధరలు పలుకుతున్నాయి. ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో ఇవే ధరలు నిలకడగా ఉంటే రైతులు కష్టాలు గట్టెక్కినట్లేనని వ్యాపారవర్గాలు అంటున్నాయి.

**దిగుబడి తగ్గుతుండడంతో ధరల పెరుగుదల**

ప్రస్తుతం టమాట పంట దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో మండీలలో రోజు రోజుకు స్టాకు తగ్గిపోతోంది. ధరలు మార్కెట్లో పెరగడానికి ఇదొక కారణంగా చెప్పుకోవచ్చని వ్యాపారవర్గాలు అంటున్నాయి. నెలల తరబడి టమాటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో కొద్దిరోజులుగా సాగు తగ్గిపోయింది.

**వారం రోజులుగా ధరలు**



మార్కెట్లో వారం రోజులుగా టమాట ధరలు పెరుగుతున్నాయి. నాలుగు నెలలుగా ధరలు 25 కేజిల క్రేట్‌ ధర రూ. 250 నుంచి 300 లోపే ఉండేది. ప్రస్తుతం ధరలు మూడింతలు పెరిగాయి. ఈమధ్యలో ఎప్పుడు ఈమేరకు ధర పెరుగుదల చూడలేదు. ధరలు నిలకడగా ఉంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– చెంగయ్య, టమాట రైతు, గరుడారెడ్డిపల్లె.

**ధరల నిలకడతో లాభాలు**



టమాట ధరలు వారం రోజులుగా మార్కెట్లో నిలకడగా ఉన్నాయి. ఈసీజన్‌లో ధరలు పెరగడం చాలా అరుదు. మండీలకు స్టాకు పెద్దగా రావడం లేదు. దినికితోడు పండుగ సీజన్‌ కావడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పెరిగిన ధరలు ఇలాగే ఉంటే రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది.

– జగదీష్‌, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

### 22న 'తనేగా ప్రాణం' పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ: స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో యువ రచయిత మంజుప్రీతం రచించిన ×తనేగా ప్రాణం® పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి నాగభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ రచయితలు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు అప్పినపల్లి భాస్కరాచారి, ప్రజాస్రవంతి సంస్థ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సాహితీ ప్రియులు హాజరు కావాలని కోరారు.

### మసీదు ప్రహరీ నిర్మాణానికి రూ.5లక్షలు

పీలేరు: మసీదు ప్రహరీ నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు సర్పంచ్‌ హబీబ్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక యల్లమంద క్రాస్‌ వద్దగల మసీద్‌ ఏ ఇలాహీ కి రాజంపేట ఎంపీ పివి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మసీద్‌ ప్రహరీ నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు సర్పంచ్‌ తెలిపారు. అనంతరం మసీదులో ముతవల్లీలు, మైనారిటీనాయకులు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు ఆనంద్‌ , ఉదయ్‌, షాకీర్‌, మునీర్‌, ఆబీద్‌, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- 31వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం
- సచివాలయ సిబ్బందిని ఆదేశించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఏదైనా సాంకేతిక కారణాలతో జాప్యమైనా వారిని గుర్తించి మంజూరయ్యేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 31వార్డులో కౌన్సిలర్‌ సింధలూరి రజని ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌ షమీంఅస్లాం, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌ జింకావెంకటాచలపతి, కౌన్సిలర్‌ రజని, రవితో కలిసి ఇంటింటికీ పర్యటించారు. వైఎస్సార్‌ సీపీ మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రెడ్డీస్‌ కాలనీలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు చెప్పగా అక్కడికక్కడే వాటర్‌ లైన్‌మన్‌లను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అలాగే ఓ వివాహిత తాను డిగ్రీ, బీఈడీ చదువుకున్నానని, ఏదైనా ఉద్యోగం ఇప్పించాల్సిందిగా విన్నవించింది. ఫిబ్రవరిలో బీటీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌ సీపీ మెగా జాబ్‌ మేళాకు హాజరుకావాల్సిందిగా సూచించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తామని ప్రజలు చెపుతుంటే సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్‌.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ, వసీం, భాను, రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్‌, కరీముల్లా, ఎం.వి.రమణ, కోఆప్షన్‌ శారదరెడ్డి, వైస్‌ ఎంపీపీ నందిని తాజ్‌, సర్పంచ్‌ దండుకరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు ఎస్‌.ఇర్ఫాన్‌ఖాన్‌, గుండ్లూరు రఫీ, చందూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మసీదులు, ఆలయాల అభివృద్ధికి ఎంపీ నిధులు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ఈద్గా స్థల యజమానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల తదితరులు

కలికిరి: ఎంపీ, పార్లమెంటు ప్యానల్‌ స్పీకర్‌ పీవీ మిథున్‌రెడ్డి ఈ నెల 10వ తేదీన మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి స్థానికులు మసీదుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు నిధుల అవసరంపై విన్నవించారు. పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. వారి వినతుల పరిశీలన అనంతరం కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదులు, చెరువుముందరపల్లి రామాలయం అభివృద్ధికి రూ.18 లక్షలు నిధులు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే చింతల రామంచంద్రారెడ్డి, మైనారిటీ రాష్ట్ర కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఇక్బాల్‌ అహ్మద్‌, ఏపీఎండీసీ డైరెక్టర్‌ హరీష్‌ రెడ్డి మండలంలో పర్యటించి ఆయా మసీదుల కమిటీలు, ఆలయాభివృద్ధి కమిటీకి నేరుగా నిధులు అందజేశారు. వీటిలో కలికిరి క్రాస్‌ రోడ్డు కలకడ మార్గంలో నూతన ఈద్గా ఏర్పాటుకు గాను స్థలం కొనుగోలుకు స్థల యజమాని సుబహాన్‌ బాషాకు రూ.14లక్షలు, ఏఎస్‌ఆర్‌ కాలనిలోని జామియా మసీదు విస్తరణకు రూ.2.5లక్షలు, బీడీ కాలనిలోని ఉమర్‌ మసీదు విస్తరణకు రూ.లక్ష, కొర్లకుంట సార మసీదులో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు పత్రం అందించారు. అలాగే చెరువుముందరపల్లిలోని రామాలయం అభివృద్ధికి రూ.50 వేల నగదు, మండల పరిషత్‌ నిధుల నుంచి ఆలయ ప్రహరీ ఏర్పాటుకు రూ.2 లక్షలు నిధులు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం, మైనారిటీలకు సముచిత స్థానం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్‌ మాజీ చైర్మన్‌ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్‌, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ సతీష్‌ రెడ్డి, మండల కో–ఆప్షన్‌ సభ్యుడు రిజ్వానుల్లా, నాయకులు ఎస్టీడి హరి, బావాజీ, ఫయాజ్‌, షౌకత్‌ అలీ, ప్రదీప్‌ రెడ్డి, మారయ్య, రామలింగయ్య, సాయిప్రతాప్‌, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం
- ఏర్పాట్లపై ఎమ్మెల్యే నవాజ్‌బాషా సమీక్ష

మదనపల్లె : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వైఎస్సార్‌ సీపీ లోక్‌ సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరిలో వైఎస్సార్‌ సీపీ మెగాజాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో మెగాజాబ్‌మేళా ఏర్పాట్లపై నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే నవాజ్‌బాషా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఎంపీ మిథున్‌రెడ్డి మదనపల్లెలో మెగాజాబ్‌ మేళా ఏర్పాటు చేస్తున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గం నుంచే కాకుండా తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరవ్వచ్చన్నారు. దీనికి సంబంధించి మదనపల్లె మున్సిపల్‌ కమిషనర్‌, రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె ఎంపీడీఓలు బాధ్యత తీసుకుని సచివాలయసిబ్బంది, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నిరుద్యోగులకు జాబ్‌మేళాపై అవగాహన కల్పించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బీటీ ప్రభుత్వ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సుమారు 10,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మెగా జాబ్‌మేళా న్యూఢిల్లీకి చెందిన క్యూస్‌ కార్ప్‌లిమిటెడ్‌, సన్నితి ఇనిషియేటివ్‌ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, మదనపల్లె ఎంపీపీ రెడ్డెమ్మ, రామసముద్రం ఎంపీపీ కుసుమకుమారి, నిమ్మనపల్లె ఎంపీపీ నరసింహులు, వైస్‌ ఎంపీపీ డిష్‌రమణ, వెలుగుచంద్ర, వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

తంబళ్లపల్లె: మండలంలోని గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ ఆనంద్‌కుమార్‌ సూచించారు. శుక్రవారం పరషతోపు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు అన్ని రకాల సేవలను ప్రజలకు అందించేందుకు చొరవ చూపాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. 6వ విడత జగనన్నతోడు పథకంలో 450 యూనిట్లు మంజూరయ్యాన్నారు. చిరు వ్యాపారం చేసుకునే వారికి వడ్డీలేని రుణాలుగా రూ.10 వేల రుణ సౌకర్యం కల్పిస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్‌, వీఆర్వో రమణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ చౌడేశ్వర్‌ పాల్గొన్నారు.

### 22న ఉచిత కంటి చికిత్స శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై శంకర నేత్రాలయకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి జబ్బులతో బాధపడేవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. పుంగనూరు మండలం కుదపూరుకు చెందిన వెంకటరమణ(33) భార్య తేజ (25), కుమారులు భగత్‌(5), హర్ష (4)లతో కలిసి ద్విచక్రవాహనంలో చౌడేపల్లె మండలంలోని పెద్దూరులో జరిగే పశువుల పండుగకు బంధువుల ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ వీరిని ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నాడు–నేడు పనులు వెంటనే పూర్తి చేయండి


నడిమిచెర్లలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : నాడు–నేడు పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంఈఓ మునీంద్రనాయక్‌ సూచించారు. శుక్రవారం మండలంలోని నడిమిచెర్ల, కదిరాయచెర్వు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇచ్చి కార్పొరేట్‌ పాఠశాలల కంటే మెరుగ్గా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్‌, నడిమిచెర్ల సర్పంచ్‌ నల్లమ్మ, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, చలమయ్యగౌండ్‌, చిరంజీవి యాదవ్‌, రమణ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌ లేకుంటే కళాశాలలోకి నో ఎంట్రీ



నో హెల్మెట్‌ నోఎంట్రీ బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం

కురబలకోట: మోటార్‌ సైకిళ్లు కలిగిన విద్యార్థులు, అధ్యాపకులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని లేదంటే కళాశాలలోకి ఎంట్రీ లేదని అంగళ్లులోని మిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ యువరాజ్‌ తెలిపారు. శుక్రవారం కళాశాల బయట నో హెల్మెట్‌ నో ఎంట్రీ బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌ ఆవశ్యకతపై ఇదివరకే అవగాహన కల్పించామన్నారు. ఆశించిన స్థాయిలో ఆచరణ లోకి రావడం లేదన్నారు. జరుగుతున్న రోడ్డు ప్రమాదకర సంఘనలపై విధిలేని పరిస్థితిలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాల్సిందిగా కోరారు.

## సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తంబళ్లపల్లె: మండలంలో విజృంభిస్తున్న సీజనల్‌ వ్యాధులు జలుబు, దగ్గు, టైఫాయిడ్‌ మలేరియా, డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్‌ మునికుమార్‌ తెలిపారు. శుక్రవారం మర్రిమాకులపల్లెలో ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురికి బీపీ, షుగర్‌ పరీక్షలు చేసి, జ్వరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఆరోగ్యంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పీఎంవోవో రెడ్డెప్పరెడ్డి కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో రమణ, పీహెచ్‌ఎస్‌ సుమలత పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దు


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌

గుర్రంకొండ: ఆటోలను ఇష్టానుసారంగా రోడ్లపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగంచవద్దని కలకడ సీఐ నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ 340 జాతీయ రహదారిపై గుర్రంకొండ బస్టాండు ఉందన్నారు. దీంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఆటోలను ఇష్టానుసారం రోడ్డుపై, బస్టాండులో నిలిపి వేస్తుండడంతో నిరంతరం ట్రాఫిక్‌కు సమస్య వస్తోందన్నారు. కేటాయించిన పార్కింగ్‌ స్థలాల్లో ఆటోలను నిలుపుకోవాలన్నారు. డ్రైవర్లందరు తప్పని సరిగా డ్రెస్‌ కోడ్‌ పాటించడంతో పాటు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేయండి

జడ్జి ఎస్‌.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

పీలేరు రూరల్‌: పీలేరులో వచ్చేనెల 11న జరగనున్న జాతీయ లోక్‌ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా పదకొండవ అదనపు జడ్జి ఎస్‌.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఇరువర్గాలను ఒప్పించి వారి అభిప్రాయం మేరకు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌ జ్యోతి, గాయత్రి, ఏపీపీ శారద, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అన్సారీ, న్యాయవాదులు భవానీశంకర్‌, సాకత్‌, సిఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ శ్రీనివాసులు, ప్రకాష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## మొరంపల్లె రోడ్డును బాగుచేయండి



గుర్రంకొండ: మండలంలోని టిపసలవాండ్లపల్లె పంచాయతీ మొరంపల్లె రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలోని ఎగువ మొరంపల్లె, దిగువ మొరంపల్లె గ్రామాల నుంచి గ్రామ కస్బా టి. పసలవాండ్లపల్లె వరకు రోడ్డు అధ్వానంగా మారింది. తారు రోడ్డు వెంబడి వెళ్లాలంటే చుట్టూ తిరిగి నాలుగు కిలోమీటర్ల మేరకు ప్రజలు వెళ్లాల్సి ఉంటుంది. ప్రతి రోజు సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్‌ క్లీనిక్‌లో పనుల కోసం ప్రజలు టి.పసలవాండ్లపల్లెకు వెళుతుంటారు. అదే ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు ను బాగు చేస్తే కిలోమీటరులోపే దూరంతో టి.పసలవాండ్లపల్లెకు చేరుకోవచ్చు. గతంలో రోడ్డు ఉండగా కాలక్రమేణా పూర్తిగా దెబ్బతింది.

## హెచ్‌ఎన్‌ఎస్‌ యూనిట్‌ –1 స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా రోహిణి

మదనపల్లె : హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్‌ –1 స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా పీ. రోహిణి నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 133 ఉత్తర్వుల ప్రకారం బదిలీలు, డిప్యూటీ కలెక్టర్ల నియామకాల్లో భాగంగా హెచ్‌ఎన్‌ఎస్‌ యూనిట్‌ –1 డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. మహేశ్వర రావును బదిలీ చేస్తూ ఆయన స్థానంలో స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా పీ. రోహిణిని నియమించారు.